ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 24 మార్చి 2024



విధుల నుంచి క్షేత్రసహాయకుడు తొలగింపు

కలెక్టరేట్/ పలాస రూరల్, మార్చి 23: పలాస మండలం బొడ్డపాడు గ్రామ పంచాయతీకి చెందిన క్షేత్ర సహాయకుడు(ఫీల్డ్ అసిస్టెంట్) పోతనపల్లి సరోజవర్మను విధుల నుంచి తప్పించినట్టు ఉపాధిహామీ పథకం సంచాలకుడు జీవీ చిట్టిరాజు శనివారం తెలిపారు. సరోజవర్మ రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొంటున్నట్టు ఫిర్యాదు వచ్చింది. దీనిపై పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో భరత్‌నాయక్ విచారణ చేపట్టి.. వాస్తవమేనని ధ్రువీకరించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్టు నిర్ధారణ కావడంతో సరోజవర్మను విధుల నుంచి తప్పించామని చిట్టిరాజు తెలిపారు.



వర్క్‌షాపులో టీడీపీ జిల్లా నేతలు

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శనివారం విజయవాడలో నిర్వహించిన సదస్సుకు పార్టీ జిల్లా నేతలు హాజరయ్యారు. ప్రజాగళం- ఎన్నికల వ్యూహంపై వర్క్‌షాపు నిర్వహించగా.. ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేల అభ్యర్థులంతా పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం, ప్రత్యర్థులను ఎత్తులను ఎదుర్కోవడం ఎలా తదితర అంశాలపై చర్చించారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

- అరసవల్లి/ నరసన్నపేట/ పలాస



లైసెన్స్ తుపాకుల స్వాధీనం

- బ్యాంకుల్లో ఉన్న 74 మినహా అన్నీ రికవరీ
- పోలీసు శాఖకు 199 డిపాజిట్
- జిల్లాలో 3,624 మందిపై బైండోవర్లు

(శ్రీకాకుళం క్రైం)

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలంతా ఓటుహక్కు వినియోగించుకునేలా విశాఖ డీఐజీ విశాల్ గున్ని ఆదేశాల మేరకు ఎస్పీ జీఆర్ రాధిక చర్యలు చేపట్టారు. ఇప్పటికే కేంద్ర బలగాలు జిల్లావ్యాప్తంగా మోహరించాయి. ప్రతీ గ్రామంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఫాగ్‌మార్చ్‌లు, కార్డెన్ సెర్చ్‌లు, చెక్‌పోస్టు భద్రత, రాష్ట్ర, అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. శాంతి భద్రతల్లో భాగంగా రౌడీషీటర్లు, అనుమానితులు, గత ఎన్నికల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో జిల్లాలో లైసెన్స్ పొందిన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 273 లైసెన్స్ తుపాకులు ఉన్నాయి. వీటిలో బ్యాంకు సెక్యూరిటీ గార్డులు, క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసుల వద్ద 74 ఉన్నాయి. వీటిని మినహాయించి.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వ్యక్తిగత భద్రత, వివిధ రకాల లైసెన్స్‌దారుల వద్ద ఉన్న 199 తుపాకులను పోలీసులకు డిపాజిట్ చేశారు. వీటిని ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో భద్రపరిచారు. జిల్లా వ్యాప్తంగా 183 సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను పోలీసులు గుర్తించారు. ఈ గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు. కేంద్ర, పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ వచ్చేనాటికి జిల్లావ్యాప్తంగా 3,624 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో గంజాయి, ఎన్‌డీపీఎస్‌ఎఫ్, ఐడీ లిక్కర్, వ్యక్తులను గాయపరిచే అంశాల్లో ముగ్గురిపై పీడీ యాక్ట్ అమలు చేశారు. ఇద్దరు జిల్లా బహిష్కరణలో ఉన్నారు. ఒకరు కోర్టును ఆశ్రయించి న్యాయస్థానం ఆదేశాలనుసారం జిల్లాలో కొనసాగుతున్నట్లు ఎస్పీ రాధిక తెలిపారు.

తప్పుడు ప్రచారాలు వద్దు: ఎస్పీ రాధిక



ఆన్‌లైన్ వేధింపులు, సోషల్‌మీడియా ట్రోలింగ్స్ ద్వారా తప్పుడు వార్తలు, ప్రచారాలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ జీఆర్ రాధిక శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికగా తప్పుదారి పట్టించే సమాచారాన్ని, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలను పోస్టులు, ఫార్వర్డ్ చేయకూడదని సూచించారు. ఎన్నికల నిబంధనలను, నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే హెల్ప్‌లైన్ నెంబర్ 1950కి, ల్యాండ్ లైన్‌నెంబర్ 08942-240606కి కానీ, డబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైం. గవర్నమెంట్.ఇన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగిందేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కోరారు.

భల్లూకం.. బీభత్సం



దాడికి పాల్పడిన ఎలుగుబంటి..

- ఎలుగుబంటి దాడిలో ఇద్దరు రైతుల మృతి
- ఒక మహిళకు తీవ్రగాయాలు
- జీడితోటలకు వెళ్లేందుకు భయపడుతున్న వైనం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సావిత్రి



కూర్మారావు (ఫైల్)



లోకనాథం (ఫైల్)

వజ్రపుకొత్తూరు, మార్చి 23: వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీ అనకాపల్లిలో ఎలుగుబంటి బీభత్సం సృష్టించింది. జీడితోటల్లో పనులకు వెళ్లిన రైతులపై దాడి చేసింది. ఈ క్రమంలో ఇద్దరు రైతులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో మహిళ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనతో అనకాపల్లిలో విషాదం అలుముకుంది. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లికి చెందిన చీడిపల్లి లోకనాథం (47), ఆయన భార్య సావిత్రి, అప్పికొండ కూర్మారావు (49) శనివారం ఉదయం జీడితోటల్లో పనులు చేసుకుంటున్నారు. ఈ సమయంలో జీడి తుప్పల్లో ఉన్న ఎలుగుబంటి సావిత్రిపై దాడి చేసింది. పక్కనే ఉన్న భర్త లోకనాథం ఆమెను రక్షించేందుకు ప్రయత్నించగా ఆయనపైనా దాడి చేసింది. ఇద్దరూ గట్టిగా కేకలు వేయడంతో పక్కతోటలో ఉన్న కూర్మారావు అక్కడికి చేరుకున్నాడు. ఎలుగుబంటిని తరిమికొట్టేందుకు ప్రయత్నించగా.. ఆయనపై కూడా దాడి చేసింది. చుట్టుపక్కల తోటల్లో ఉన్న రైతులంతా సంఘటన స్థలానికి చేరుకుని గట్టిగా కేకలు వేయడం.. కర్రలతో తరిమికొట్టడంతో ఎలుగుబంటి పక్క తోటల్లోకి పారిపోయింది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న ఆ ముగ్గురినీ స్థానికులు పరిశీలించగా.. లోకనాథం, కూర్మారావు మృతి చెందినట్టు గుర్తించారు. సావిత్రిని పలాస ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. అటవీశాఖాధికారులు భాస్కరరెడ్డి, పోలయ్య తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలాస ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. విచక్షణారహితంగా దాడి చేసి ఇద్దరి మృతికి కారణమైన ఎలుగుబంటిని గ్రామస్థులు ఆగ్రహంతో కర్రలతో కొట్టి హతమార్చారని తెలుస్తోంది. ఈ విషయాన్ని అటవీశాఖాధికారులు మాత్రం ధ్రువీకరించలేదు.



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

భయం.. భయంగానే..

కొద్దిరోజుల కిందట ఇదే ప్రాంతానికి చెందిన ఐదుగురిపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ముగ్గురు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా శనివారం అనకాపల్లిలోని జీడితోటల్లో ఎలుగుబంటి దాడిలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రస్తుతం జీడిపంటల సీజన్ కాగా.. ఎలుగుబంట్లు దాడుల కారణంగా తోటలకు వెళ్లేందుకు రైతులు భయాందోళన చెందుతున్నారు. ఎలుగుబంట్ల నియంత్రణలో అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. సంఘటనలు జరుగుతున్నప్పుడు మాత్రమే అధికారులు స్పందించి పరామర్శలు చేస్తున్నారని.. తర్వాత వాటి నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. మందస మండలం బహడపల్లి నుంచి వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వరకు ఒకే ఒక అధికారి పర్యవేక్షిస్తున్నారని.. అలాంటప్పుడు ఎలుగుబంట్ల నియంత్రణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలుగుబంట్ల నుంచి తమకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇది అటవీశాఖ నిర్లక్ష్యమే



కాశీబుగ్గ బస్టాండు వద్ద ఆందోళన చేస్తున్న అనకాపల్లి గ్రామస్థులు, మృతుల బంధువులు

పలాస, మార్చి 23: వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లిలో ఎలుగుబంటి దాడి ఘటనలో ఇద్దరు మృతి చెందడం, ఒకరు తీవ్రగాయపడడంతో గ్రామస్థులు ఆందోళన చేశారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు బైఠాయించారు. లోకనాథం, కూర్మారావు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా అడ్డుకుని ఆందోళన చేశారు. ఎప్పటికప్పుడు ఎలుగుబంట్లు ప్రజలపై దాడి చేస్తున్నా.. అటవీశాఖాధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎలుగుబంట్లను సంరక్షణశాలలకు పంపించేలా చర్యలు చేపడితే తమకు ఇటువంటి ఇబ్బందులు ఉండేవి కావని ఆవేదన వ్యక్తం చేశారు. వజ్రపుకొత్తూరు మండలంలోనే వందకుపైగా ఎలుగుబంట్లు ఉన్నాయని, తరచూ దాడులు చేస్తున్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా అటవీశాఖ అధికారులు గ్రామంలోకి వెళ్లకుండా ఇతర మండలాలకు చెందిన ఇద్దరు సిబ్బందిని ఆస్పత్రికి పంపించడం గమనార్హం. ఎలుగుబంట్లు దాడి చేసి ఇద్దరు మరణిస్తే కనీసం అధికారులు స్పందించరా? అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎలుగుబంట్ల దాడి నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ, పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

వ్యాపారి నుంచి రూ.1.36లక్షల స్వాధీనం

పాతపట్నం, మార్చి 23: పాతపట్నం మండలం సీది కూడలిలో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన వ్యాపారి పొట్నూరు శివప్రసాద్ వద్ద రూ.1.36లక్షలు స్వాధీనం చేసుకున్నారు. శివప్రసాద్ ఈ నగదును వ్యాపారం నిమిత్తం విశాఖపట్నం తీసుకెళ్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడ్డారు. కాగా.. నగదుకు సంబంధించిన వివరాలు తెలియజేస్తే వాటిని తిరిగి ఇచ్చేస్తామని ఎస్ఐ మహ్మద్ తెలిపారు. తనిఖీల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారిణి ఏశైలజ, హెచ్‌సీ మోజిద్, పీసీలు గణపతిరావు, శ్యామలరావు, మదన్ మోహన్ పాల్గొన్నారు.



వ్యాపారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు

ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

గుజరాతీపేట, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డీఆర్వో గణపతిరావును కోరారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ సంఘ నాయకులు శనివారం డీఆర్వోను కలిసి ఎలక్షన్ విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందించారు. అలాగే 55 ఏళ్లు పైబడిన, దివ్యాంగులతోపాటు గర్భిణులకు, బాలింత ఉద్యోగులకు ఎన్నికల విధులు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీఆర్వోను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, జిల్లా శాఖ అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, దాసరి రామ్మోహనరావు, వి.నవీన్‌కుమార్, పి.తిరుమలరావు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

పలాసరూరల్, మార్చి 23: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బొడ్డపాడు గ్రామంలో శనివారం జిల్లా న్యాయశాఖ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థ, చట్టాల అమలు, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, సరైన సమయంలో వాటిని వినియోగించుకోవాలన్నారు. వైద్య శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీ సన్యాసినాయుడు, ఇన్‌చార్జి న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత, డీఎంహెచ్‌వో డా.మీనాక్షి, సూపరింటెండెంట్ పాణిగ్రాహి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకట్రావు, జాయింట్ సెక్రటరీ అనిల్‌రాజ్, ఎంపీడీవో వైకుంఠరావు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

ప్రారంభానికే పరిమితం

- లబ్ధిదారులకు కేటాయించని ఏహెచ్‌పీ గృహాలు
- కానరాని మౌలిక సదుపాయాలు
- రుణాలు చెల్లించాలంటూ బ్యాంకర్ల ఒత్తిడితో ఆందోళన



ఇంకా నిర్మాణంలోనే సామూహిక మరుగుదొడ్లు

(పలాస)

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోని కోసంగిపురం వద్ద నిర్మించిన ఏహెచ్‌పీ (అఫ్రోడబుల్ హౌసింగ్ పార్ట్‌నర్‌షిప్) గృహాల లబ్ధిదారులకు ఎదురుచూపు తప్పడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నరేళ్లు పట్టించుకోలేదు. ఇక ఎన్నికల కోడ్ కూస్తుందని తెలిసి.. ఇటీవల హడావుడిగా మంత్రి సీదిరి అప్పలరాజు ఏహెచ్‌పీ గృహాలను ప్రారంభించారు. కానీ లబ్ధిదారులకు ఇంకా వాటిని కేటాయించలేదు. రహదారులు, విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు, పెయింటింగ్, కాలువలు, తాగునీటి సదుపాయం వంటి పనులు పూర్తికాకపోవడమే ఇందుకు కారణం. ఇవన్నీ పూర్తిచేసేందుకు కనీసం ఆరు నెలలు పడుతుంది. కానీ మౌలిక సౌకర్యాలు కల్పించే దిశగా ప్రయత్నాలు చేయడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మరోవైపు బ్యాంకర్ల ఒత్తిడి ఎక్కువవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- టీడీపీ ప్రభుత్వ హయాంలో కోసంగిపురం వద్ద 50ఎకరాల విస్తీర్ణంలో.. 1,950 గృహాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. 950 గృహాలు పూర్తయ్యాయి. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రాగా.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెండర్లు రద్దు చేశారు. పూర్తయిన గృహాలకు పెయింటింగులు వేసి తాము లబ్ధిదారులకు ఇస్తామని వైసీపీ నేతలు ప్రకటించారు. కానీ ఇంతవరకూ కేటాయించలేదు. ఈ నెల 7న మంత్రి సీదిరి అప్పలరాజు హడావుడిగా ఈ గృహాలను ప్రారంభించారు. కానీ, పనులు పూర్తికాకపోవడంతో వాటిని లబ్ధిదారులకు కేటాయించలేదు. పూర్తయిన గృహాల్లో 500కు పైగా బ్యాంకు గ్యారెంటీలు, నగదు పూర్తిగా కట్టుకొని పక్కాగా రిజిస్ట్రేషన్లు చేశారు. బ్యాంకు గ్యారెంటీ ఉన్న వారిపై బ్యాంకర్లు వడ్డీ, అసలు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కేటాయించని గృహాలకు తామెందుకు డబ్బులు చెల్లించాలని బ్యాంకర్లను నిలదీస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకర్లు, నిర్మాణదారుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. రోడ్లు, కాలువలు, మరుగుదొడ్లు, విద్యుదీకరణ, పెయింటింగ్, ప్లంబింగ్ పనులు పూర్తిచేసి గృహాలు తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ వద్ద ప్రస్తావించగా.. లబ్ధిదారులపై ఒత్తిడి తేవొద్దని బ్యాంకర్లతో మాట్లాడుతామని తెలిపారు. గృహాలన్నీ రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నిర్మిస్తున్న కాంక్రీట్ శ్లాబ్‌లు..



అడుగంటి 'నది'

తీరప్రాంత గ్రామాల్లో వేలాది మందికి తాగునీరు... రైతులకు సాగునీరు అందించే వంశధార నది వేసవి రాకముందే అడుగంటిపోయింది. ఇప్పుడే ఎడారిని తలపిస్తోంది. ఏప్రిల్, మే నెలల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు గార మండలంలో తీరప్రాంత గ్రామాల ప్రజలు మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి నుంచి తీరప్రాంత గ్రామాల ప్రజల నీటి సమస్య తీరేందుకు గొట్టాబ్యారేజ్ నుంచి నదిలోకి కొద్దిగా నీటిని విడిచిపెట్టాలని కోరుతున్నారు.

- గార

ఎన్నికల ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

● కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

హరిపురం, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. మందస తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం సందర్శించి ఎన్నికల ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలపై ఆరా తీశారు. ఎన్నికల ప్రచారంలో కోడ్ ఉల్లంఘన జరిగితే వెంటనే చర్యలు తీసుకుని నివేదికలను అంద జేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం సిద్ధిగాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించి భద్రత వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలబాబు, రెవెన్యూ అధికారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


హరిపురం: రెవెన్యూ అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్


నందిగాం: కవిటిఅగ్రహారం ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు

పోలింగ్ శాతం పెరిగేలా చైతన్యం

నందిగాం: రానున్న సాధారణ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేలా ఓటర్లలో చైతన్యం నింపాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. శనివారం ఆకులరఘునాథపురంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. ఏ ఒక్క కేంద్రం లోనూ ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో తీసుకుంటున్న చర్యలపై టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల నిర్వహణపై సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, తహసీల్దార్ వి.పద్మావతిల నుంచి ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శివ ప్రసాద్, ఎస్‌ఐ మహ్మద్ అమీర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

అన్నిశాఖలు భాగస్వామ్యం కావాలి: సబ్ కలెక్టర్

నందిగాం: ఓటుహక్కు వినియోగంపై గ్రామాల్లో నిర్వహిస్తున్న అవగాహనా సదస్సులు, ర్యాలీల్లో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని టెక్కలి ఆర్వో, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. శనివారం పలు గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై వెలు గు ఆధ్వర్యంలో సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రజలను చైతన్య వంతం చేయాలని, దీనికి గాను వెలుగు, ఉపాధి, ఐసీడీఎస్ తదితర శాఖలన్నీ కలిసి ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ వి.పద్మావతి, ఎంపీడీవో జి.శివప్రసాద్, ఏపీఎం జాంబవతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు బలమైన ఆయుధం

డోల(పోలాకి): ప్రజాస్వామ్యంలో ఓటరుకు ఓటు బలమైన ఆయుధమని వెలుగు ఏపీఎం గోరు రాజారావు అన్నారు. శనివారం డోల, గోవిందపురం, మెట్టపేట గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఓటు ఆవశ్యకతపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డోల ఉదయభాస్కర్, మహిళాసమాఖ్య సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పొందూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పొందూరు మండలం రాపాక చెక్‌పోస్టును జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పరిశీలించారు. వాహనదారులు, ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని జేసీ కోరారు. రాపాక, బి.కంచరాం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను, బి.కంచరాంలో గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంసీసీ అధికారులు, ఎంపీడీవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● **బూర్జ:** డొంకలపర్త, లక్కుపురం, అల్లెన, పాలవలసలోని పోలింగ్ కేంద్రాలను జేసీ నవీన్ శనివారం సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు విధిగా ఏర్పాటు చేయాలని, ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ అంబేడ్కర్, రూట్ ఆఫీసర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బూర్జ: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవీన్


పోలాకి: డోల గ్రామంలో మానవహారం నిర్వహిస్తున్న మహిళా సంఘాలు

ఎన్నికల నియమావళిని పాటించాలి

మెళియాపుట్టి: ఎన్నికల నియమావళిని అంగన్‌వాడీ కార్యకర్తలు పాటించాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ ఆదేశించారు. శనివారం నందవ, నాయుడుపోలూరుగ్రామాల్లో పోషణ్ పక్వాడ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వస్తున్న పోషక పదార్థాలపై సీఎం ఫొటో కనిపించకుండా మూసివేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాజకీయ పార్టీల సమావేశాలుకు దూరంగా ఉండాలన్నారు. ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడీపీవో విమలారాణి, సూపర్‌వైజర్లు అనూరాధ, ప్రియవదన తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదని ఫిర్యాదు

నరసన్నపేట: ఇటీవల 12వ వార్డులో సామాజిక భవన ప్రహరీ ప్రారంభోత్సవానికి వేసిన శిలాఫలకంపై తన పేరు వేయలేదని వార్డు సభ్యుడు గొలివి రామారావు ఈవో చిన్నా రావుకు శనివారం ఫిర్యాదు చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎన్నికల కోడ్ అమలైనా శిలాఫలకం మూసివేయలేదని ఆయన ఫిర్యాదు చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తలపై విచారణ

వజ్రపుకొత్తూరు: బాతుపురం అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.స్వాతికుమారి విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఐసీడీఎస్ పీవో శార్వాణి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులు విచారణకు హాజరుకాకపోవడంతో గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యు.లత, ధనలక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. పెదవంక అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ విద్యార్థులకు బర్త్‌డే నిర్వహించారు.

చట్టాలపై అవగాహన

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో ధర్మనీలాపురంలో నిర్వహి స్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా శనివారం 'చట్టాలు-వాటి పనితీరు'పై రిటైర్డ్ పాలిటిక్స్ లెక్చరర్ ఎస్.తిరుపతిరావు అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడిచెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారీని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్‌ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహాలను వినియోగించుకోండి

నరసన్నపేట: ఉచిత న్యాయ సలహాలను పేద ఖైదీలు వినియోగించుకోవాలని సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును పరిశీలించారు. క్షణికావేశానికి లోను కాకుండా ఉండాలన్నారు. సత్ప్రవర్తనతో జైలుశిక్ష తగ్గుతుందన్నారు. భోజన, ఆరోగ్య సదపాయాలపై ఖైదీలకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులభారం ప్రజలపై పడుతోంది

పలాస: అధికారంలోకి వచ్చిన పార్టీలు రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు అప్పులు చేస్తారని, పదవీకాలం పూర్తయిన తరువాత ఆ భారం ప్రజలపై పడుతోందని బీజేపీ నాయకుడు, అమ్మ ఆశ్రమ నిర్వాహకుడు రామానంద స్వామి ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎవరి పదవీకాలంలో చేసిన అప్పులు వారే తీర్చాలని, లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. సామాన్యులు బ్యాంకుల్లో చిన్న అప్పులు చేసి సకాలంలో వాటిని తీర్చేందుకు ఇబ్బందులు పడతారని, అప్పు తీర్చకుంటే వారి ఆస్తులు జప్తు చేస్తున్నారని, అయితే అధికారంలో ఉన్న నేతలకు ఈ చట్టాలు అమలు కాకపోవడం దారుణమన్నారు.

ఎలుగుబంటి బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

పలాస: వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లిలో ఎలుగుబంటి దాడిలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని మంత్రి అప్పలరాజు శనివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అలాగే మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకుంటుందని, నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఆయన వెంట ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డబ్బీరు భవానీ శంకర్ ఉన్నారు.

ఎలుగుబంట్ల దాడుల నుంచి రక్షించాలి

పలాసరూరల్: పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని ఉద్దానం ప్రాంతంలో ఎలుగు బంట్లు ప్రజలపై దాడి చేస్తున్నాయని, వాటినుంచి రక్షించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ కోరారు. శనివారం గురుదాసు పురంలో విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో కిడిసింగి, గుణుపల్లి గ్రామాల్లో ప్రజలపై దాడి చేయగా ప్రాణాలు పోయాయని, శనివారం అనకాపల్లిలో ఎలుగు దాడితో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాకర మన్నారు. ఇప్పటికైనా అటవీశాఖాధికారులు స్పందించి ఎలుగుబంట్లను పట్టుకొని జూకి తరలించాలని కోరారు.

మండల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రియాగ్రహారం(పోలాకి): డోలో పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ప్రియాగ్రహారం యువజన సంఘం ఆధ్వర్యంలో మండలస్థాయి కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. టోర్నమెంట్‌ను సర్పంచ్ బెవర నూకరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంబాబు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

నరసన్నపేట: వేసవిలో చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీవెంకటసాయి ఆసుపత్రి వైద్యురాలు రెడ్డి సంధ్య అన్నారు. శనివారం జమ్ము గ్రామంలో ఆసుపత్రి, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 243 మందికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణుడు నవీన్, ముద్దాడ మానస, ఎన్‌ఎస్‌ఎస్ పీవో అప్పారావు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం

జలుమూరు (సారవకోట): సంఘాలను ఏర్పాటు చేసుకుని సమష్టి కృషితోనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం బుడితి శాఖ అధ్యక్షుడు నిక్కు హరిసత్యనారాయణ అన్నారు. బుడితి గ్రామంలో శనివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు ఎటువంటి సమస్యలున్నా వాటిని సంఘం దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం స్థాపించిన నాటి నుంచి వివిధ రకాల సేవలను అందించిన నిక్కు హరిసత్యనారాయణ, వాన కనకయ్య, శశిభూషణ పాడి, ఆనెం చంద్రశేఖర్, ఆనెం అప్పలస్వామిలను సంఘ సభ్యులు సత్కరించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నేతలు వి.మురళీమోహనరావు, రొక్కం కృష్ణారావు, మొయ్యి లక్ష్మణరావు, రావాడ త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వల్లభ నారాయణ స్వామి డోలోత్సవాలు


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


సముద్ర స్నానాలు చేస్తున్న దృశ్యం

హరిపురం: రట్టి వల్లభనారాయణ స్వామి డోలోత్సవాలు మూడో రోజు శనివారం కొనసాగాయి. ఈవో పి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు రట్టి సీతారాం, నీలకంఠం, ప్రహ్లాదులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి ఆలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో స్వామివారి తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయంలోని ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి ప్రీతిపాత్రమైన కలశ అమృతాన్ని నైవేద్యంగా భక్తులు సమర్పించారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

జలుమూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. అతి సమస్యాత్మక గ్రామాలైన అల్లాడపేట, రామకృష్ణాపురం, అందవరం, పర్లాం తదితర గ్రామాల్లో ఎస్‌ఐ మధుసూదనరావు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించి ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు.


అల్లాడపేటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు

జలుమూరు: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అనుమతులు లేకుండా రవాణా అయ్యే గంజాయి, మద్యం, గుట్కాలను నివారించేందుకు ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆధారాలు లేని నగదు తరలించినా, నిషేధిత సరుకులు రవాణా చేసిన పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ ప్రతినిధి తిరుపతిరావు తెలిపారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. జలుమూరు, చల్లవానిపేట కూడలి, లింగాలవలస, తిలారు కూడళ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ మూల్యాంకన కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

గుజరాతీపేట: పదో తరగతి పరీక్షలు పూర్తయిన వెంటనే మూల్యాంకన ప్రారంభమవుతుందని, ఆ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని డీఈవోను ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం డీఈవోను కలిసి వినతి పత్రం అందించారు. అదేవిధంగా గత మూల్యాంకన బకాయిలు తక్షణమే ఈ మూల్యాంకనం ప్రారంభానికి ముందే చెల్లించాలని కోరారు. అనారోగ్య కారణాలతో మినహాయింపు కోరిన వారందరిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్పాట్ రెమ్యూనరేషన్ వాల్యూకేషన్ పూర్తయిన రోజుల వారి అకౌంట్లో జమ అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. స్పాట్ కేంద్రా ల్లో తాగునీరు, ప్లాంకులు, పెన్నులు తదితర సదుపాయాలు కల్పించాల న్నారు. డీఈవోను కలిసిన వారిలో మజ్జి మదన్‌మోహన్, ఎస్‌వీ అనిల్‌కుమార్, నవీన్ కుమార్, డి.రామ్మోహనరావు, ఎస్.శంకరరావు, పి.అప్పలనాయుడు ఎన్.శ్రీనివాస్, టి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి ఎంజేపీ బీసీ మత్స్యకార బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముంజేటి పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్‌కు 40 మంది చొప్పున ఉంటారన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేపడతామన్నారు.

నీటిని సంరక్షించుకోవాలి

పలాసరూరల్: జలాన్ని ఒడిసి పట్టి సంరక్షించుకోవాలని, దీనితోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ఉపాధ్యాయులు అన్నారు. బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్‌లో శనివారం జల దినోత్సవాన్ని జాతీయ హరితదళ క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 'నీటి సంరక్షణ 1950- 2050'పై నాటక ప్రదర్శన నిర్వహించారు. నీటిని పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎ.మధుబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీడి తోట బాధితులను ఆదుకోండి

నందిగాం: కల్లాడ పంచాయతీ కందులగూడెంకు చెందిన కేరాసింగి నాగేశ్వరరావు, భీమా రావు జీడితోటల దగ్ధంతో తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి ఎం.నాగరాజు, మాజీ సర్పంచ్ ఎన్.తిరుపతిరావు కోరారు. శనివారం బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో జీడి తోటలు దగ్ధమైనా ఇంతవరకు అధికారులు, పాలకులు స్పందించలేదన్నారు. ఐటీడీపీ కన్వీనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో పేదల ఇంట్లో వెలుగు

నరసన్నపేట: టీడీపీ అధికారంలో వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు పేదల ఇంట్లో వెలుగులు నింపుతాయని తెలుగు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి జల్లు చంద్రమౌళి అన్నారు. శనివారం ఉర్లాం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎంగా చేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతో పాటు వైసీపీ అరాచకాలను ప్రజలకు వివరించారు. అలాగే నారాయణ వలస గ్రామంలోనూ బాబు ష్యూరిటీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉర్లాంలో సూపర్ సిక్స్‌పై అవగాహన కలిగిస్తున్న తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి జల్లు చంద్రమౌళి

తెలినీలాపురంలో...

టెక్కలి: తెలినీలాపురం గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నేతలు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి మాట్లాడుతూ.. టీడీపీని అధికారంలోకి తీసుకురావడం ద్వారా మన భవిష్యత్‌ను మార్చుకోగలమన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు టీడీపీతోనే సాధ్యం

సంతబొమ్మాళి: టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఆపార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. శనివారం సంతబొమ్మాళి కంచ్రవీధి, ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు పలకాలని కోరారు.

అవినీతి పాలనకు అంతం పలకాలి

జలుమూరు (సారవకోట): బటన్ నొక్కి అవినీతికి పాల్పడిన జగన్ పాలనకు అంతం పలకాలని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. కోదడ్డపనస గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు బగ్గు రమణమూర్తి, కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

కవిటి: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బి.అశోక్ సతీమణి నీలోత్పల అన్నారు. ఇద్దివానిపాలెంలో శనివారం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి మేలు జరగాలంటే బాబు పాలన రావాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో ధరలు పెంచి సామాన్యులను ఇబ్బందుల పాల్జేశారన్నారు. ఉమ్మడి పార్టీల అభ్యర్థులు బి.అశోక్, ఎంపీ రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, నేతలు బి.రమేష్, సూరాడ చంద్రమోహన్, బి.చిన్నబాబు, వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

శిరీష గెలుపే లక్ష్యం: జనసేన నేతలు

పలాస: పలాస నియోజకవర్గంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని జనసేన నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, టీడీపీ పలాస సమన్వయకర్త వెంకన్న చౌదరిని కలిశారు. జనసేన నాయకులు సంతోష్‌పండా, కిల్లి బాలకృష్ణ, బంగారు కేదార్, ఎం.నర్సింహ మూర్తి, సవర సుమన్, చిట్టిబాబు మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను వివరి స్తామని, శిరీష విజయానికి ప్రచారం చేస్తామన్నారు. మాజీ మంత్రి శివాజీ మాట్లాడుతూ.. ఐదేళ్లుగా రాష్ట్రంలో, నియోజకవర్గంలో దోపిడీ జరిగిందని, వాటికి అడ్డుకట్టు వేయడానికి ఈ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉన్న గౌతు శిరీషను గెలిపించాలని కోరారు.

పార్టీల బ్యానర్లు ఉంచొద్దు

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణ, మండల పరిధిలో గల ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో ఎక్కడా రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, జెండాలు ఉండ కుండా చూ డాలని సంబంధిత అధికారులను ఎన్నికల రిట ర్నింగ్ అధికారి సుదర్శన్ దొర ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న ఆర్వో సుదర్శన్ దొర

టికెట్ కేటాయించకపోవడంపై క్యాడర్ అసంతృప్తి

● కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం: కలమట

కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా కలమట వెంకటరమణను పార్టీ అధిష్ఠానం ప్రకటించకపోవడంపై ఆ పార్టీ క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం మాతలలో కార్యకర్తలు, నాయకులు సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు హాజరై కలమటకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు సీటు కేటాయించకపోవడం ఆవేదనగా ఉందన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయం మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. అందరూ సంయమనం పాటించాలన్నారు.

ఒడిసా మద్యం స్వాధీనం

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల చెక్‌పోస్టు వద్ద శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఒడిసా మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మహమ్మద్ యాశిన్ తెలిపారు. టెక్కలికి చెందిన ఒక వ్యక్తి రెండు ఒడిసా మద్యం సీసాలతో వస్తూపట్టుబడ్డారన్నారు. దీంతో మద్యంతోపాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

జి.సిగడాం: అక్రమంగా మద్యం తరలిస్తు పట్టుబడిన వ్యక్తిని జి.సిగడాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలం గెడ్డకంచరాం గ్రామానికి చెందిన బర్రి అప్పలరాజును అదే గ్రామం బస్టాండ్ వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలతో పట్టుకోని, అప్పలరాజు నుంచి 16 మద్యం సీసీలు స్వాదీనం చేసుకోన్నారు. వీటి విలువ రూ.2400 ఉంటుందన్నారు. అప్పలరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మదుసూధనరావు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: పోగడవెల్లి గ్రామంలో శనివారం ఎస్ఈబీ టాస్కఫోర్సు అధికారులు చేసిన దాడుల్లో 1400 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేయడంతోపాటు 40 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ రామచంద్రకుమార్ తెలిపారు. ఎన్నిలు నేపథ్యంలో ఎక్కడైనా సారా తయారు, అమ్మకాలు జరిగితే సమాచారాన్ని అందించాలన్నారు. ఈ దాడుల్లో టెక్కలి ఎస్ఈబీ ఎస్ఐ రాజశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

87వ రోజుకు చేరిన బెంతు ఒరియాల నిరసన


నిరసన తెలుపుతున్న బెంతు ఒరియాలు

కవిటి: బెంతు ఒరియాలు తమ నిరసన శనివారం నాటికి 87వ రోజుకు చేరింది. నాథపుట్టుగ గ్రామానికి చెందిన వినోద్‌దొళాయి, హరిప్రసాద్ దొళాయి, రమేష్ దొళాయి, రంజిత్ దొళాయి, సుమన్ బిసాయిలు మాట్లాడుతూ.. ప్రతిపక్షనేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో కుల ధ్రువీకరణకు హామీ ఇచ్చి అధికారంలో వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కమిషన్లతో కాలయాపన తప్పా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గుర్తింపు లేకపోవటంతో తమ పిల్లలు అన్నివిధాలుగా నష్టపోతున్నారన్నారు.

అధినాయకత్వం పునఃపరిశీలన చేయాలి

● మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వర్గీయులు


మాట్లాడుతున్న గుండ అప్పలసూర్యనారాయణ

అరసవల్లి: శ్రీకాకుళం అసెంబ్లీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే, నియోజ కవర్గ పార్టీ ఇన్ చార్జి గుండ లక్ష్మీ దేవికి కేటాయిం చాలని, ఈ విషయంలో అధిష్ఠానం పునఃపరిశీలన చేయాలని ఆమె వర్గీయులు డిమాండ్ చేశారు. నగరంలోని అరసవల్లిలో గల గుండ అప్పల సూర్యనారాయణ నివాసంలో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎంపీ గెలవాలన్నా, టీడీపీ బలపడాలన్నా టికెట్ లక్ష్మీదేవికే ఇవ్వాలన్నారు. పార్టీకోసం నిజాయతీగా, క్రమశిక్షణతో పనిచేసిన వారికి టికెట్ ఇవ్వకపోవడం సబబు కాదని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. శనివారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీలో గ్రూపులపై రాష్ట్ర అధ్యక్షునికి విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటి పరిస్థితికి పార్టీ అధిష్ఠానమే బాధ్యత వహించాలన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం


శ్రీకాకుళం క్రైమ్: వాహన తనిఖీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతా వరణంలో నిర్వహిం చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా శనివారం నగరంలోని గూనపాలెం, మండలవీధి, మహాలక్ష్మీనగర్ కాలనీల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆ యన పరిశీలించారు. కేంద్ర బలగాలతోపాటు స్టేషన్ సిబ్బందితో కలిసి పలు ప్రాంతా ల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు.

● **పొందూరు:** ఎన్నికల సమయం లో గ్రామాల్లో గొడవలు, వివాదా లు లేకుండా ప్ర శాంతంగా నిర్వ హించడమే లక్ష్య మని ఎస్ఐ వై.రవి కుమార్ అన్నారు. తోలాపి బి.కంచరాం గ్రామాల్లో శనివారం ప్రత్యేక బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు, ఏఎస్ఐ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


పొందూరు: తోలాపిలో పోలీసు కవాతు

ఎన్నికల కోడ్ వర్తించదా?


బీచ్‌లో కాటేజీ వద్ద... వమరవల్లి డైట్ వద్ద..

గార: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికి ఇంకా పలుచోట్ల శిలాఫలకాల మీద ఎటువంటి కాగితాలు కూడా మూత లేకుండా కనిపిస్తున్నాయి. కె.మత్స్యలేశం బీచ్‌లో పర్యాటక శాఖ కాటేజీ నిర్మాణం కోసం మంత్రి ధర్మాన వేసిన శిలాఫలకంపై మూతలు వేయలేదు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డైట్ సెంటర్ వద్ద..

ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చినా వమరవెల్లి డైట్ లో కొత్తగా నిర్మిస్తున్న భవనం మంత్రి ధర్మాన ప్రసాద రావు వేసిన శిలాఫలకం మీద ఎటువంటి కాగితాలు కూడా మూత లేకుండా కని పిస్తోంది. ఈ విషయమై సం బంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఇచ్ఛాపురం: బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎన్నికల అధికారులు, సిబ్బంది



జి.సిగడాం: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి

● జాయింట్ కలెక్టర్ నవీన్


ఆమదాలవలస: బైక్ ర్యాలీలో పాల్గొన్న జేసీ నవీన్

ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్నవారంతా నిర్భయంగా ఓటింగ్‌లో పాల్గొనాలని ఆమదాలవలస నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కృష్ణాపురం మీదుగా వన్‌వే జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం స్థా నిక రైల్వే స్టేషన్ ఆవరణలో నిర్వహించన కార్య క్రమంలో జేసీ పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు ఆశపడకుండా మంచి పరి పాలకుడిని ఎన్నుకొనే విధంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నిక ల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అన్నారు. శని వారం ఓటు హక్కు వినియోగంపై ఆర్వో ఆధ్వర్యం లో బైక్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాల యం నుంచి పురుషోత్తపురం వరకు తిరిగి బస్టాం డ్ వరకు వీఆర్వోలు, బీఎల్వోలు, వీఆర్వోలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ శ్రీహరి, ఆర్ఐ శ్రావణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

జి.సిగడాంలో..

జి.సిగడాం: ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం రెడ్డి రామకృష్ణం నాయుడు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఓటుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీ రవికుమార్, గ్రామ సంఘ సభ్యులు, మండల సమైక్య సభ్యులు, సీసీలు, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: కళాశాల ప్రాంగణంలో డీజేతో కోలాహలంగా..

పరీక్ష కేంద్రం వద్ద డీజే శబ్దాలా?

● 144 నిబంధనలకు తూట్లు

ఆమదాలవలస: పట్టణంలో శనివారం నిర్వహిం చిన ఎన్నికల అవగాహన బైక్ ర్యాలీ సందర్భంగా సంబంధిత అధికారులు అత్యుత్సాహం చూపించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ర్యాలీ ఏర్పాట్లు చేశారు. డీజే, డప్పు వాయిద్యాలు ర్యాలీలో పాల్గొనే బైక్‌లు తొలుత కళాశాల ప్రాంగణానికి చేరుకుని శబ్దాలతో హడావుడి చేశారు. ఇక్కడే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 143 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాస్తున్న సంగతి అధికారులు పట్టించుకోలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రతి పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్న విషయం కూడా సంబంధిత అధికారులకు పట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రతీ ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి



కంచిలి: మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

కంచిలి: ఉద్దానం ప్రాంత ప్రజలంతా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించు కోవాలని, అప్పుడే కిడ్నీ వ్యాధిబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చునని జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జేపీ మౌలానా అన్నారు. శనివారం కంచిలి పీహెచ్‌సీ కేంద్రం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, కిడ్నీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధిపై సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, వైద్యులు భానుప్రకాష్, హరిబాబు, తహసీల్దార్ ఎంవీకేఎస్ రవి, ఎంపీడీవో వి.నీరజ, సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● **సోంపేట:** పట్టణంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక సామాజిక ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, ఎంపీడీవో వి.నీరజ, ఈవోపీఆర్డీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న జయభారత రెడ్డి

ఎచ్చెర్ల: విద్యార్థి దశ నుంచే సమాజానికి, పరిసర ప్రాంతాలకు ఉపయోగపడేలా పరిశోధనలు చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణల కోసం పారిశ్రామిక, విద్యారంగం సమ్మేళనం థెర్మో ఫిషర్ సంస్థతో శనివారం వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సౌత్ ఏసియా జనరల్ మేనేజర్ జయ భారతరెడ్డి (ముంబై) మాట్లాడుతూ.. పరిశ్రమలకు వినియోగపడే వినూత్న ఆలోచనలు, పరిశోధనలు విద్యా సంస్థల స్థాయిలోనే జరగాలన్నారు. పలు బయో ఇంక్యుబేషన్ కేంద్రాలతో ఎంవోయూ కుదుర్చుకుని వైద్య, జీవశాస్త్ర రంగాల్లో మరింత లోతుగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. పరిశోధనలు, వినూత్న ఆలోచనల దిశగా యువతకు సంస్థ అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. అనంతరం జరిగిన వర్క్‌షాపులో సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ లీడ్ కల్యాణ్ చక్రవర్తి (బెంగళూర్), అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ చాణుక్య నుగూర్ (హైదరాబాద్) తదితరులు మాట్లాడారు. కాగా వర్సిటీ ఇంక్యుబేషన్, ఆర్అండ్‌డీ డీన్ ఎస్.లోకేశ్వరి రూపొందించిన సన్రైజ్ బైట్స్ అనే నూతన స్టార్టప్‌ను వీసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు


పూజలు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: శనిత్రయోదశి పూజలు ఘనంగా జరిపారు. శనిత్రయోదశి సందర్భంగా శివాలయాల ప్రాంగణలో ఉన్న శనీశ్వరుని ఆలయాల్లో ప్రత్యేకంగా తైలాభిషేకాలు జరిపారు. చిదంబరేశ్వర, పాతాళసిద్ధేశ్వర, కాశీవిశ్వనాథ, రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న శనీశ్వరునిని దర్శించుకుని, అనంతరం శివాలయాల్లో పూజలు చేశారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటాలి


క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో, తదితరులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జాతీయస్థాయి వుషూ పోటీల్లో క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ వుషూ పోటీల్లో పాల్గొంటున్న 18 మందితో కూడిన జిల్లా జట్టు శనివారం పయనమైంది. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఆయన మాట్లాడూతూ.. ఖేలో ఇండియాలో జిల్లా జట్టు సత్తాచాటినట్టే జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ముఖ్య సలహాదారుడు పి.సుందరరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా వుషూ సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, శిక్షకులు కొమర మోహన్‌కృష్ణ, రెడ్డి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థలో ప్రాసిక్యూషన్ అంతర్భాగమే


సమావేశంలో పాల్గొన్న ఏపీపీలు

గుజరాతీపేట: న్యాయవ్యవస్థలో ప్రాసిక్యూషన్ కూడా అంతర్భాగమేనని జిల్లా ప్రాసెక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో గల ప్రాసిక్యూషన్ కార్యాలయంలో జిల్లాలోని అదనపు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ.. సుప్రీమ్ కోర్టు, వివిధ హైకోర్టుల జడ్జిమెంట్లు ఎప్పటికప్పుడు చదువుకోవాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానంతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇటీవల మహిళా కోర్టు పీపీగా నియమితులైన ఎల్.వెంకటరమణ, సీహెచ్ సత్యనాయణలను సన్మానించారు. సమావేశంలో ఏపీపీలు టి.శివప్రసాదరావు, సీహెచ్ శ్రీకాంత్, కోత తిరుమలరావు, కొమర శంకరరావు, కె.ఉషాకిరణ్, కె.ఉషారాణి, కిమిడి సూర్యకుమార్, ఎల్.నాగభూషణం, జి.ప్రియదర్శిని, ఆర్.శాంతి సంతోషిని, వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అఖండ విష్ణు సహస్రనామ స్తోత్రం

సరుబుజ్జిలి: రొట్టవలస శ్రీరామానందశ్రమ గురుస్వామి తొత్తడి వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం అఖండ విష్ణు సహస్ర నామపారాయణం చేపట్టారు. ఇటీవల ఆనందాశ్రమంలో మండలానికి చెందిన పలువురు భక్తులు శ్రీరామదీక్షలు చేపట్టడం, వారితో పాటు రొట్టవలస సవలాపురం జంక్షన్ హొంజరాం, గోనెపాడు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. శనివారం గోనెపాడు గ్రామంలో మామిడి రామారావు ఆధ్వర్యంలో 49 రోజులు సప్త సప్తాహ కార్యక్రమం ఉదయం తిరువారాధన, మధ్యాహ్నం విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం రామాయణ ప్రవచనం చేపట్టారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

ఇచ్ఛాపురం: సన్యాసిపుట్టగ గ్రామంలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు వేడుకగా జరుగుతున్నాయి. శనివారం నాలుగో రోజు ఆలయంలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణలో ఏర్పాటు చేసిన నారాయణసేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, కాళ్ల గోపి, డి.కామేష్, తదితరులుపాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: మోడల్ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 28 నుంచి మే 22వ తేదీ వరకు ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎటువంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● **కవిటి:** రాజపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి మే 22 లోగా ప్రవేశ రుసుం చెల్లించి దరఖాస్తు చేయాలన్నారు.

సంతకాలకే పరిమితం

బూర్జ: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని శనివారం సభ్యుల సంతకాలతోనే ముగించారు. ఎంపీపీ దీప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కోడ్ అమల్లో ఉన్నందున సమావేశంలో ఏ విషయాలు చర్చించలేమని ఎంపీడీవో రవీంద్రబాబు సభ్యులకు తెలియజేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 90 రోజుల్లోపు నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో నిబంధనలు మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సభ్యుల సంతకాలే తప్ప ఎటువంటి అంశాలపై చర్చలు ఉండవని స్పష్టం చేశారు.

51 శక్తి పీఠాలను దర్శించడమే లక్ష్యం


పాదయాత్ర చేస్తున్న దుర్గాప్రసాద్

ఇచ్ఛాపురం: ప్రపంచంలో ఉన్న 51శక్తి పీఠాలు తన జీవితకాలంలో దర్శించుకోవటమే తన లక్ష్యమని మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దుర్గాప్రసాద్ లోవన్షి అన్నారు. శక్తిపీఠాలు దర్శించుకోవటంలో భాగంగా భోపాల్‌లో గతేడాది మార్చి 10న పాదయాత్ర ప్రారంభించిన ఆయన శనివారం ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత్‌తో పాటు నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్థాన్‌లో ఉన్న 51 శక్తిపీఠాలను దర్శించుకొని నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. రోజుకి 20 కిలోమీటర్లు నడుస్తున్నానని, దగ్గర్లో ఉన్న దేవాలయాల్లో నిద్రిస్తున్నానన్నారు. టీ కొట్టు నడుపుకుంటూ భార్య తోపాటు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలను పోషించుకుంటున్నానని, ఇప్పుడు అన్ని బాధ్యతలు కుటుంబ సభ్యులకు అప్పగించి శక్తిపీఠాలు దర్శనానికి శ్రీకారం చుట్టానని తెలిపారు.

మేలుజాతి దూడలతో ఉపయోగం

గార: మేలు జాతి దూడల పెంపకం వల్ల అధిక పాల దిగుబడితో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా పశుగణాభివృద్ధి సంఘ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ నంబాళ్ల దామోధర్ రావు అన్నారు. శనివారం ఉదయం ఆయన గార పశువైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం నిజామాబాద్ గ్రామంలో ఆడదూడలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జల్లువలస గోపాలమిత్ర ముద్దపు ప్రసాదరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అరసవల్లి: భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



ఎచ్చెర్ల: నివాళులర్పిస్తున్న సీఐటీయూ నేతలు


పాతపట్నం: భగత్ సింగ్ విగ్రహం వద్ద ..

భగత్‌సింగ్ స్ఫూర్తిగా యువత ముందుకు సాగాలి

● ఏఐవైఎఫ్ నాయకుడు మొజ్జాడ యుగంధర్

అరసవల్లి: స్వాతంత్ర్యయం కోసం ప్రాణాలు అర్పించిన వీరుడు భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలోని ఎస్టీ హాస్టల్‌లో వారు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు. భగత్‌సింగ్ ఆశయాలను సాధించినప్పుడే వారికి మనం నిజమైన నివాళి అర్పించినవారం అవుతామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కిశోర్, సాయి సందీప్, మణికంఠ, నాగేశ్వర రావు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.



నరసన్నపేట: నివాళులు అర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు


పలాసరూరల్: బొడ్డపాడు అమరవీరు స్మారక భవనంలో నివాళులర్పిస్తున్న దృశ్యం